# పోలీస్ బిల్ వస్తోంది! పారిపోండి!




మనరాష్ట్రంలో ఫైవ్‌డేవీక్ వచ్చిందని మా కాలనీ వాళ్ళందరూ ఎంతో సంతోషించారు గానీ మా సంతోషం ఎంతకాలం నిలువలేదు. వారానికి రెండురోజుల ఖాళీ దొరికేసరికి శాయిరాం మరింత విజృంభించాడు. ప్రతి చిన్న సంఘటనకీ నానా హడావుడీ చేసి కొంపలు మునిగిపోయినట్లు పెద్ద మీటింగ్‌లు పెట్టేస్తున్నాడు.

శుక్రవారం నాడు ఉదయం నేను నిద్రలేస్తూనే మా పక్కింటివాళ్ళ పిల్లి మొఖం చూశాను. పొద్దున్నే పిల్లిని చూస్తే ఆశుభం అని మా పక్కింటివాళ్ళు దానిని రాత్రే బయటకు తోలేసి తలుపులు వేసేస్తూంటారు. అంచేత అది మిగతా ఇళ్ళల్లో ఎక్కడో పడుకుని పొద్దున్నే కిటికీలోనుంచి దర్శనమిస్తూంటుంది.

"పిల్లి శకునం మంచిదికాదు కదా– ఏం జరుగుతుందో" అని అనుకుంటూ "ఈ క్షణం" పేపర్ తీసుకున్నాను.

ఈలోగా బయట పెద్ద కోలాహలం బయల్దేరింది.

మరి కాసేపటికి మా శ్రీమతి రానేవచ్చేసింది.

"త్వరగా బయటకురండి– సినిమా యాక్టర్లు వచ్చారు.." అందామె నాకేం అర్థం కాలేదు. బయటకొచ్చి చూశాను. అదే సమయానికి రంగారెడ్డి, గోపాల్రావ్, శాయిరామ్,

చంద్రకాంత్ అందరూ కళ్ళు నులుముకుంటూ వాళ్ళిళ్ళల్లోంచి బయటకొచ్చారు.

కాలనీ మధ్యలో ఆడాళ్ళూ, పిల్లలూ గుమిగూడిపోయారు. మధ్యలో జనార్ధన్, యాదగిరి నిలబడి ఉన్నారు.

"సినిమా యాక్టర్లంటే వీళ్ళా?" నిరాశగా అన్నాడు చంద్రకాంత్.

అందరం వాళ్ళ దగ్గరకెళ్ళాం.

జనార్ధన్ ఆడాళ్ళకూ పిల్లలకూ సినిమా ఫీల్డు గురించి ఎంతో ఉత్సాహంగా చెప్పేస్తున్నాడు.

"చిరంజీవి తెలీకపోవటం ఏమిటి? రోజూ నేను చిరంజీవీ కలిసే భోజనం చేసేవాళ్ళం స్టూడియోలో–"

"మరి కృష్ణతో మాట్లాడావా?"

"మాట్లాడ్డమా? వాళ్ళింట్లో రెండు రోజులున్నాను–"

కొంతమంది పిల్లలు సంతోషం పట్టలేక తప్పట్లు కొట్టారు.

"మీ పిక్చర్లో మీ పక్కన హీరోయిన్ ఎవరు?" అడిగింది రాజేశ్వరి.

"విజయశాంతిని బుక్ చేస్తామన్నారుగానీ నేనొప్పుకోలేదు. కొత్తవారికి అవకాశం ఇచ్చాం–"

"ఎవరయినా మంచి యాక్టర్స్ ఉన్నారా మీ పిక్చర్లో?" అడిగింది పార్వతీదేవి.

జనార్ధన్‌కి కోపం వచ్చింది.

"అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి? మేము మంచి యాక్టర్స్ కాదనా?"

పార్వతీదేవి తడబడింది.

"అబ్బే అలా అని కాదు. పేరున్నవాళ్ళు ఇంకెవరయినా–"

"మా పిక్చర్ రిలీజయాక చూడరాదూ? మా ఇద్దర్లో ఎవరో ఒకళ్ళకు బెస్ట్ యాక్టర్ ఎవార్డొస్తది–" అన్నాడు యాదగిరి.

అప్పుడు మమ్మల్నందర్నీ చూశాడు జనార్ధన్.

"నమస్తే అన్నా!" అన్నాడు విష్ చేస్తూ.

"పిక్చర్ పూర్తయిపోయిందా?" అడిగాన్నేను.

"ఆ అయిపోయింది! వచ్చేవారమే రిలీజ్–" అని నావేపు అనుమానంగా చూశాడతను "సారీ! ఏమీ అనుకోవద్దు– మీ పేరు ఉదయార్కర్ కదూ?"

"నాకు మళ్ళీ మండిపోయింది. రెండు నెలలకే పేర్లు మర్చిపోయినట్లు నటనా?

"ఏం సినిమాల్లో కెళ్ళాక మతిపోయిందా?" శాయిరామ్ వెటకారంగా అడిగాడు.

"అబ్బే మర్చిపోవటం కాదు! జస్ట్ కన్‌ఫ్యూజన్ బలరామ్‌గారూ–"

"నాపేరు శాయిరామ్! బలరామ్ కాదు–"

'ఓ! అవునవును– వెరీసారీ! వేలమంది అభిమానులుండట వల్ల ఈ జ్ఞాపకశక్తితో మహా ఇబ్బందిగా ఉంది రఘురామరెడ్డిగారూ!"

"పోజులు కొట్టకు! నా పేరు రంగారెడ్డి–" చిరాగ్గా అన్నాడు రంగారెడ్డి.

"ఓ– అయామ్ సారీ! ఆ మధ్య గుమ్మడీ నేనూ కలసి షూటింగ్ కెళ్ళినప్పుడు ఇలాగే.."

ఈలోగా వాళ్ళావిడ వచ్చింది.

"ముందింటికి పదండి! తరువాత తీరిగ్గా చెప్దురుగాని మీ అనుభవాలు–" అంటూ అతగాడి సూట్‌కేస్ బాగ్ తీసుకుని వెళ్ళిపోయింది.

దాంతో జనార్ధన్ యాదగిరి అయిష్టంగానే ఇళ్ళల్లోకి వెళ్ళక తప్పలేదు. అయితే వెళ్ళేప్పుడు జనార్ధన్ అచ్చం సినిమా హీరోలాగానే అందరికి చేయి ఊపుతూ వెళ్ళాడు.

"ఇంక మనాడి ఫోజులు భరించలేమనుకుంటాను–" అన్నాడు రంగారెడ్డి.

"వచ్చే శని ఆదివారాల్లో మన కాలనీ తరపున మనవాడికి సన్మానసభ ఏర్పాటు చేద్దాం!" అన్నాడు శాయిరామ్ ఉత్సాహంగా.

నేనూ, గోపాల్రావ్ శాయిరామ్ వంక తీక్షణంగా చూశాం.

ఆ వారం రోజులూ జనార్ధన్ మా కాలనీలో అందరికీ 'సినిమా' అంటే విరక్తి కలిగేంతగా బోర్ కొట్టి వదిలేశాడు.

గురువారం ఉదయం జనార్ధన్, యాదగిరి, శాయిరామ్ మా ఇంటికొచ్చేశారు హడావుడిగా.

"గురూ! మా పిక్చర్ రేపు విజయవాడలో రిలీజవుతోంది! మనందరం వెళ్ళి సినిమా చూసివద్దాం!" అన్నాడు జనార్ధన్.

"విజయవాడకు వెళ్ళాలా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును!"

"అక్కడి కెళ్ళడం ఎందుకు? ఇక్కడే చూడవచ్చుకదా?"

"ప్రస్తుతానికి ఇక్కడ రిలీజవటం లేదు–"

"ఎందుకని?"

"ఈ ఏరియాలో ఎవరూ కొనటం లేదు. అంచేత ముందు విజయవాడ ఒక్క ఊళ్ళోనే రిలీజ్ చేస్తున్నారు. అదికూడా మాణింగ్ షోస్ మాత్రమే. అంచేత మనం ఇవాళ సాయంత్రమే బయల్దేరి వెళ్దాం! ప్లీజ్! మా ప్రొడ్యూసర్‌కూడా ఫామిలీతో బయల్దేరుతున్నాడు. ఒక బస్ బుక్ చేశాం. మనందరికోసం."

"ఆయనన్నడిగే దేమిటిలెండి– మన కాలనీవాళ్ళ మొఖాలకు ఒక పిక్నిక్కులేదు పాడులేదు. తెల్లారిలేస్తే మన కాలనీలోనే ఒకరి మొఖాలోకరు చూసుకోవటం – మనమీదపడే అవాంతరాలు సరిదిద్దుకోవటంతోనే సరిపోతోంది. అందరం సరదాగా వెళ్దామని మా ఆడాళ్ళంతా నిర్ణయించుకున్నాం–" అంది మా శ్రీమతి లోపల్నుంచీ.

ఆ పరిస్థితుల్లో ఇంక మాకు గత్యంతరం లేక బయల్దేరడానికి వప్పుకున్నాం. సాయంత్రం ఆరుగంటలకల్లా బయల్దేరింది బస్. అనుకున్న దానికంటే ఎక్కువమంది బయల్దేరేసరికి బస్‌ఫుల్ అయిపోయింది. దారిలో జనార్ధన్ పిల్లలకూ ఆడాళ్ళకూ తమ సినిమా ఫీల్డ్ తాలూకూ విశేషాలు వివరిస్తున్నాడు.

"ఆ సినిమా షూటింగవుతూండగానే ఇంకా బోలెడు ఆఫర్లు వచ్చాయ్ పార్వతీదేవి గారూ! నన్నూ చిరంజీవినీ పెట్టి ఇద్దరూ హీరోలుగా సినిమా తీయాలని ఒక ప్రొడ్యూసర్ వచ్చాడు. కానీ నేనే వప్పుకోలేదు."

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగింది సావిత్రమ్మగారు.

"ఎందుకేమిటి?" టైటిల్స్ వేసేప్పుడు– మా ఇద్దరిలో ముందు ఎవరిపేరు వేస్తారని అడిగాను! చిరంజీవి పేరు ముందువేసి తరువాత నాది వేస్తామన్నారు. నాకది నచ్చలేదు. ముందు నా పేరు వేయమన్నాను."

"అబ్బ!– " అందరూ ఆశ్చర్యపోయారు.

"అవునుమరీ! చిరంజీవికి నాకంటె ఎక్కువమంది అభిమానులుండవచ్చు. రేపు ఈ పిక్చర్ రిలీజయాక నాకు మాత్రం అభిమానులుండరూ?"

బస్ విజయవాడలో ప్రవేశించేసరికి రాత్రి ఒంటిగంటయిపోయింది.

తీరా గవర్నర్‌పేట్ దగ్గర కొచ్చేసరికి బస్ ఓ పోలీస్‌వాన్ మా కెదురుగ్గా వచ్చింది. అందులోనుంచి ఓ కానిస్టేబుల్ దిగి బస్ ఆపమని సైగచేశాడు.

బస్ ఆపాడు డ్రైవర్.

మరుక్షణం నలుగురు కానిస్టేబుల్స్ బస్‌లో జొరపడ్డారు.

"దిగండి అందరూ–" అరచాడొకతను.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"బస్ చెక్ చేయాలి!"

"ఎందుకు?"

"ముందు దిగవోయ్–" మీదకొస్తూ అన్నాడతను.

ఇంకేమయినా మాట్లాడితే ఈసారి 'రా' అంటాడని ఊహించి అందరం బస్ దిగాం.

బస్ అంతా అయిదు నిమిషాల పాటు వెతికారు వాళ్ళు.

"ఏదీ? మీరు దొంగతనం చేసిన సామాను?" కిందకు దిగి అడిగాడు ఓ కానిస్టేబుల్.

"దొంగతనమేంటి."

"హైద్రాబాద్ పొలిమేరలో దొంగతనం చేసి ఒక పెద్ద గాంగ్ బస్‌లో ఇటే పారిపోయివచ్చినట్లు తెల్సింది మాకు–"

"అంటే మేం డెకాయిట్స్‌లాగా కనబడుతున్నామా?"

హఠాత్తుగా పోలీస్ వాన్‌లోనుంచి ఓ గొంతు కర్ణకఠోరంగా, ముద్దగా వినిపించింది.

"ఒరే శ్రీషైలం– ఆళ్ళనిఘ తీసుకురా!"

"పదండి–" అన్నాడు కానిస్టేబుల్.

నేనూ, శాయిరామ్, జనార్ధన్, యాదగిరి, రంగారెడ్డి, గోపాల్రావ్ వాన్ దగ్గరకెళ్ళాం, వాన్‌లోనుంచి బ్రాందీవాసన గుప్పుమంది.

ముందుకూర్చున్న పోలీస్ అధికారి మా మొఖాల మీద టార్చ్‌లైట్ వేశాడు.

"ఎవఁరామీరు?"

మాకు కోపం పొడుచుకొచ్చింది. మా ఆఫీస్‌లో పెద్ద అధికారి కూడా మమ్మల్ని 'రా' అనడు.

"మర్యాదగా మాట్లాడండీ! 'రా' అంటారేమిటి?" అన్నాడు శాయిరామ్ ధైర్యంచేసి.

లోపలి ఆకారం టార్చిలైట్ శాయిరామ్ మొఖం మీద ఫోకస్ చేశాడు.

"నువ్వెవఁరా?"

"'రా' అనవద్దనే చెప్తోంది!"

"వీడిని లోపల వేషేయండ్రా!" అరిచిందాగొంతు.

మరుక్షణంలో ఇద్దరు కానిస్టేబుల్స్ దిగివచ్చి శాయిరామ్‌ని లాక్కెళ్ళి వాన్ వెనుక తలుపులు తెరచి శాయిరామ్‌ని లోపలకు తోసి తలుపు వేసేశారు మళ్ళీ.

"వీళ్ళతో తలనొప్పి ఎందుగ్గానీ సరిగ్గా సమాధానం చెప్పి మన్దారిన మనం పోవటం మంచిది" అన్నాడు రంగారెడ్డి.

మాకు భయంవేసింది ఈ గొడవెంతదూరం వెళ్తుందోనని! అసలే ఫామిలీ చిల్డ్రన్‌తో ఉన్నాం.

"మాట్లాడరేంరా– ఎవరు మీరు?"

ఎదురు తిరగటం కంటె జవాబు చెప్పటమే మంచిదని తెలిసిపోయింది.

"మేం హైదరాబాద్ నుంచి వస్తున్నాం–" అన్నాడు రంగారెడ్డి.

"హైద్రాబాద్ నుంచి వస్తున్నారని మాకు తెలుషోయ్! మీరెవరు?"

"నా పేరు ఉదయార్కర్ ఇతనిపేరు రంగారెడ్డి– ఇతను..."

"ఆ విషయం మాకూ తెలుషోయ్–మీరెవరు?"

నేను రంగారెడ్డి వంక చూశాను. రంగారెడ్డి నావంక చూశాడు. ఏం చెప్పాలో ఇద్దరికీ అర్థం కాలేదు.

"ఒకవేళ ఉద్యోగం అడుగుతున్నారేమో–" అన్నాడు రంగారెడ్డి.

"మేము గవర్నమెంట్ సర్వెంట్స్–" అన్నాన్నేను.

"గోర్నమెంట్ షర్వెంట్స్ అని తెలుషోయ్– మీరెవరు?"

మా గొడవ చూసి తను ముందుకొచ్చి నిలబడ్డాడు గోపాల్రావ్

"వాట్జ్ ది ప్రాబ్లెమ్!" అడిగాడు గోపాల్రావ్ నిద్రకళ్ళతో.

"హూ ఆర్ యూ?" కమిషనర్ గోపాల్రావ్ నడిగాడు.

"పేరు గోపాల్రావండీ!"

"గోపాల్రావ్ అని తెలుషోయ్– నువ్వెవరు?"

"జర్నలిస్టనండీ!"

"జర్నలిస్టవని మాకు బాగా తెలుషురా! నువ్వెడివి?"

గోపాల్రావ్‌కి వళ్ళు మండిపోయింది.

"మా వాడి నెందుకు వాన్‌లో పడేశారు ముందు చెప్పండి."

"నువ్వెవడ్రా అడగటానికి?"

"నేనెవరో రేపు పేపర్ చదువుతే తెలుస్తుంది."

"వీడిని కూడా లోపలేషెయండ్రా–"

కానిస్టేబుల్స్ గోపాల్రావ్‌కూడా ఈడ్చుకెళ్ళి వాన్ లోపలకు తోసేశారు.

"బస్ షేక్‌షేశారా?" అడిగిందా గొంతు కానిస్టేబుల్స్‌ని.

"చెక్ చేశాం సార్!"

"ఏమయినా దొరికాయా?"

"ఏమీ దొరకలేదు సార్! ఈ క్షణం న్యూస్‌పేపర్ హైదరాబాద్ ఎడిషన్ దొరికింది." ఆ పేపర్ అందిస్తూ చెప్పాడు కానిస్టేబుల్.

ఆ ఆకారం పేపర్ తీసుకుని టార్చ్‌లైట్ ఫోకస్‌చేసి చూసింది.

"విజయవాడలో పోలీసు దౌర్జన్యకాండ!" గట్టిగా చదివాడతను.

"ఈ పేపర్ ఎవర్దిరా?"

రాజేశ్వరి ముందుకొచ్చి 'నాది' అంది. అతను టార్చ్‌లైట్ రాజేశ్వరి మొఖం మీద వేశాడు.

"హైదరాబాద్ నుంచి ఈ పత్రిక ఇక్కడికెందుకు తెచ్చావ్?"

"తెస్తే తప్పేముంది?"

"తేకూదదని నేను షెప్తున్నా!"

"తేవచ్చని నేను చెప్తున్నాను–" మొండిగా అందామె.

"వీడిని కూడా లోపల వేషేయండ్రా–" అరిచాందా గొంతు.

కానిస్టేబుల్ ఆశ్చర్యపోయాడు.

"ఈమె మగాడు కాద్సార్! లేడీ!"

"మొగాడు కాదా?"

"కాద్సార్!"

అతను మళ్ళీ రాజేశ్వరి మొఖం మీద టార్చ్‌లైట్ వేశాడు.

"అయితే మన జీప్‌లో వేషేయండి! రూమ్‌కి తీసుకెళ్దాం!"

ఇంక లాభంలేదని జనార్ధన్ కల్పించుకున్నాడు.

"చూడండి! ఈ పత్రిక తేకూడదని మాకు తెలీదు–"

'ఎవర్నువ్వు?" టార్చిలైట్ జనార్ధన్ మొఖం మీద పడింది.

"పేరు జనార్ధన్"

"అది తెలుషోయ్– ఎవరు?"

"సినిమా హీరోనండీ–" సినిమా హీరోవని తెలుషోయ్– ఎవరు?"

"అంటే సినిమాలో హీరోగ నటించానన్నమాటండీ."

"అంటే– పోలీస్ ఇన్‌స్పెక్టర్ వేషం వేసి, రౌడీ చేతిలో పోలీస్ మర్డరయినట్లు నటించిన పోలీష్ నువ్వేనా?"

"అది నేను కాదండీ..."

"పోలీష్‌లు అంత షేతకాని వాళ్ళనుకున్నావా? ఆల్‌రైట్– అలాంటి వేషం వేసినందుకు వీడినికూడా లోపల వేషేయండి–"

పోలీసులు జనార్ధన్‌ని పట్టుకున్నారు.

"ఆ పాత్ర వేసింది నేను కాదండీ– ఇంకో ఆర్టిస్ట్–"

"ఏవడయితే మాకేంషి? అంతా మీ షినిమా ఓళ్ళేగా– వేషేయండి–"

జనార్ధన్ కూడా వాన్ ఎక్కక తప్పలేదు.

రంగారెడ్డికి కోపం ముంచుకొచ్చింది.

"మా వాళ్లందరినీ వదలకపోతే ఇప్పుడే కలెక్టర్‌కి ఫోన్‌చేస్తాను–"

ఆ మాటతో అక్కడున్న వారంతా విరగబడి నవ్వారు.

"కలెక్టర్‌కి షేస్తావా! ఇప్పుడు పవర్సన్నీ పోలీస్‌దే– ఇంకెవరికి లేవ్–"

కానిస్టేబుల్స్ రిక్షా తీసుకొచ్చి రాజేశ్వరిని రిక్షా ఎక్కమన్నారు.

"ఆమెకు తీసుకెళ్ళడానికి వీల్లేదు" అంది సావిత్రమ్మ.

"ఎవడామాట అంది!"

"మగాళ్ళు కాద్సార్- లేడీస్"

"దాన్ని కూడా జీప్‌లో వేషెయ్-"

"ఓరి దొంగముండా కొడకల్లారా! దొంగల్ని పట్టలేక పోయినా మా హైదరాబాద్ పోలీసులే నయం కదురా-" అంటూ తిట్లు మొదలు పెట్టిందామె.

బలవంతంగా వాళ్ళిద్దర్నీ రిక్షా ఎక్కించి పోలీస్ స్టేషన్‌కి లాక్కెళ్ళి పోయారు.

"ఈళ్ళనేం చేస్తారో ఏమో! పదండి మనం కూడా పోలీస్‌స్టేషన్ కెళదాం!" అన్నాడు రంగారెడ్డి, అందరం మళ్ళీ బస్ ఎక్కబోయాం-

కాని డ్రైవర్ వప్పుకోలేదు.

"మీ మూలాన నా బస్ లాగేసుకుంటారు సార్! మీరు వెళ్ళండి స్టేషన్‌కి" అంటూ బస్ స్టార్ట్ చేసుకెళ్ళిపోయాడు.

మనం పోలీస్టేషన్ వెళ్ళి కూడా లాభంలేదిప్పుడు! మన వెంకట్రామయ్యగారింటికెళ్ళి ఆయనతో చెప్దాం పదండి-" అంది పార్వతీదేవి.

"అవును అదే బెటర్" అన్నాడు రంగారెడ్డి.

అందరం రిక్షాల్లో వెంకట్రామయ్యగారింటికి చేరుకున్నాం. ఆయన పోలీస్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి రిటైరయ్యాడు. పార్వతీదేవికి బంధువవటం వల్ల మా అందరికీ బాగా తెలుసు. పార్వతీదేవి తలుపు కొట్టింది. గాని అయిదు నిమిషాలయినా ఎవరూ తలుపు తీయలేదు. ఈసారి రంగారెడ్డి గట్టిగా తలుపులు బాదటం మొదలు పెట్టేసరికి పక్కింటివాళ్ళు లైటు స్విచ్ వేసుకుని కిటికీలోంచి చూసారు.

"ఎవరూ-" ఒకతను అడిగాడు.

"మేము వెంకట్రామయ్యగారికోసంవచ్చాం-" చెప్పాడు రంగారెడ్డి.

''అలాగా! తలుపుకొడుతోంది ఒకవేళ పోలీస్‌లేమో అని భయపడ్డాం! వెంకట్రామయ్యగారు తెల్లారుజామున నాలుగ్గంటలకు గానీ తిరిగి రారు-" అన్నారు వాళ్ళు.

"ఎక్కడికెళ్ళారు?"

"ఎక్కడికేంటి? కృష్ణాబారేజ్ అవతలవేపుకి! ఇవాళ శనివారం కదా" మాకేమీ అర్థం కాలేదు. "శనివారానికీ, కృష్ణాబారేజ్‌కీ ఏమిటి సంబంధం" అడిగింది పార్వతీదేవి.

వాళ్ళు మావంక అనుమానంగా చూశారు. "మీదీ ఊరుకాదా?"

"కాదండీ! హైదరాబాద్ నుంచి వచ్చాం–"

"అర్థదీ సంగతి! అందుకే మీకు తెలీలేదు! ఇవాళ బహిష్కరించబడ్డ వారిని కలుసుకునే రోజయ్యా!" మాకు మరీ ఆగమ్యం అయింది.

"బహిష్కారమేంటి?"

వాళ్ళు విసుక్కున్నారు. "అదేనయ్యా పోలీసులతో తగూ పెట్టుకున్న వారందరినీ పోలీసులు సిటీ నుంచి బహిష్కరిస్తున్నారు కదా! వాళ్ళంతా మరి సిటీ వదిలి తాడేపల్లి వెళ్ళి కాపురం ఉంటారు. ప్రతి శనివారం రాత్రి అటు– వాళ్ళూ, ఇటు వాళ్ళు బంధువులూ వెళ్ళి విజయవాడ సరిహద్దుల్లో వాళ్ళను కలుసుకుని రెండు మూడు గంటల వాళ్ళతో గడిపి తిరిగివస్తుంటారు–" మాకు పరిస్థితి అర్థమయింది.

"మరి వెంకట్రామయ్యగారెందుకు వెళ్ళినట్లక్కడికి?"

"ఎందుకేంటి? వాళ్ళ పెద్దబ్బాయిని వారంకిందటే సిటీ నుంచి బహిష్కరించారు కదా!"

"ఎందుకని?"

"పోలీస్‌వాళ్ళు అమ్మే లాటరీ టిక్కెట్లు కొనడానికి వప్పుకోలేదట! అందుకని బహిష్కరించారు–" అనేసి కిటికీ తలుపులు మూసేసుకున్నారు వాళ్ళు.

అందరం ఆ ఆరుగుమీదే కాసేపు కూర్చున్నాం.

"బుద్ధి తక్కువయి వచ్చినాం ఈడకి!" అన్నాడు యాదగిరి.

"అవును! ఇదంతా మీపాడు సినిమావల్లే జరిగింది" అంది పార్వతీదేవి యాదగిరి వంక కోపంగా చూస్తూ. పిల్లలు అరుగుమీదే నిద్రలోకి జారిపోయారు.

మూడవుతోండగా ఆటోలో నుంచి దిగారు వెంకట్రామయ్యగారూ– ఆయన సతీమణి, వాళ్ళ రెండో అబ్బాయీ. మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయారాయన.

"ఏమిటింక రాత్రివేళ ఇలావచ్చారు?" అన్నాడు భయంగా.

సంగతంతా చెప్పాం ఆయనకు.

"విజయవాడ పోలీసుల చేతిలో పడకుండానే ఉండాలి! పడ్డారంటే ఖాళేయే– ముఖ్యంగా ఆ తాగుబోతు సర్కిల్ ఒకాయన ఉన్నాడు. అతను రాత్రంతా తాగి వీరవిహారం చేసి కనబడ్డ వారందరినీ లాకప్‌లో పడేస్తుంటాడు..."

"అంతా అతనిష్టమేనా?" అడిగాడు రంగారెడ్డి.

"పోలీస్ బిల్ పవర్స్ అలా ఏడ్చినయ్. ఎవరేం చేయగలం?"

అందరం ఇంట్లోకి వెళ్ళి మాట్లాడుతూ కూర్చున్నాం. పదినిమిషాలయినా గడపక ముందే గట్టిగా పోలీస్ విజిల్స్, ఆ తరువాత పోలీస్‌వాన్, జీప్‌వచ్చి వెంకట్రామయ్యగారింటి ముందు ఆగినయ్. మరుక్షణంలో మా తలుపులు గట్టిగా బాదసాగారు బయట నుంచి.

వెంకట్రామయ్య వెళ్ళి తలుపు తెరచాడు.

ఎదురుగ్గా అంతకుముందు మమ్మల్ని అటకాయించిన కానిస్టేబుల్సే నిలబడి వున్నారు. మమ్మల్నిందరినీ చూడగానే వాళ్ల మొఖాలు సంతోషంతో విప్పారినయి.

"నేను చెప్పలే వాళ్ళే వీళ్ళయి ఉంటారని!" అన్నాడొకడతను.

"పదండి? బయట వాన్‌లో సర్కిల్ గారున్నారు–"

"నాతో ఏం పని?"

"అదే ఆయన్నడగండి!"

ఆయన వెనుకే నేనూ రంగారెడ్డి కూడా వెళ్ళాం.

"ఎవర్రా నువ్వు?" అదే గొంతు.

"వెంకట్రామయ్యనండీ–"

"తెలుషోయ్– వెంకట్రామయ్యవని తెలుషు! ఎవర్నువ్వు?"

"మాది పోలీస్ డిపార్ట్‌మెంటేనండీ! అయిదేళ్ళయింది రిటైర్ అయి"

"తెలుషోయ్ పోలీస్ డిపార్ట్‌మెంటనీ– ఎవరు?"

"ఎవరంటే ఇంకేం చెప్పనండీ?"

"అర్థరాత్రి మీ ఇంట్లో మీటింగ్ ఎవరి పర్మిషన్ తీసుకుని పెట్టావ్?"

"ఇది మీటింగ్ కాదండీ! బంధువులొచ్చారు!"

"అయినా మీటింగే అది! పర్మిషన్ చూపించు–"

"బంధువులతో మాట్లాడ్డానికి పర్మిషనెందుకండీ–"

"నీకు పోలీస్ బిల్ గురించి తెలీదా? ఎవరు గుమికూడినా, గుమి కూడినచోట ఏ సబ్జెక్ట్ మాట్లాడాలన్నా పోలీసులే పర్మిషనివ్వాలి! నీ ఇష్టం వచ్చిన సబ్జెక్ట్ మాట్లాడకూడదు–"

"మేము కేవలం మా క్షేమ సమాచారాల గురించి మాట్లాడుతున్నామండీ–"

"దానిక్కూడా పర్మిషనుండాలి– ఏయ్ త్రీనాట్ ఫోర్–"

"యస్సార్–"

"వీళ్ళందరూ లోపల ఏం మాట్లాడుతుండగా విన్నావ్?"

"తాగుబోతు అయిన పోలీస్ అధికారివల్ల ప్రజలంతా నానా ఇబ్బందులూ పడుతున్నారని మాట్లాడుకుంటున్నారండీ–"

"వేషేయ్ లోపల వీడిని–"

"దిసీజ్ టూమచ్– మేము..."

అతని మాటలు వినిపించుకోకుండా అతనిని వాన్‌లో వేసేశారు– అది చూసి పార్వతీదేవికి మండిపోయింది.

"పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళనికూడా చూడకుండా అరెస్ట్ చేస్తారా- మీకేమయినా సిగ్గుందా?" అందామె కోపంగా.

"ఆడెవడు?" అడిగాడు సర్కిల్.

"వాడు కాద్సార్! ఆమె! లేడీస్-"

"నీయమ్మ! ఈ లేడీస్ తెగ బరితెగించిపోయారే ఇవాళ. వేషేయండి లోపల వాడితో పాటు"

పార్వతీదేవిని వాన్ ఎక్కించిపోయేసరికి నేను వెళ్ళి అడ్డుపడ్డాను.

"సార్! ఆమెను వదిలేయండి! తెలీక పొరబాటు మాట్లాడింది-"

"తెలీక మాట్లాడిందా?"

"అవునండీ!"

టార్చ్‌లైట్ పార్వతీదేవి మొఖం మీద పడింది.

"ఆర్నీయమ్మ- ఇది షిల్కుష్మిత కదూ?" అన్నాడతను ఆశ్చర్యంగా.

మేం ఉలిక్కిపడ్డాం.

"అబ్బే కాదండీ! మా కాలనీలోనే ఉంటుందామె-" గాబరాగా అన్నాను.

"పోవోష్! నాకు తేడా తెలీదేంటి? ఇది షిల్కుష్మితే!- ఏయ్ ష్మితా! నేను నీ ఫ్యాన్నే! నీ సెక్స్ డాన్స్‌లన్నీ తెగ షూస్తా- ఆ షినిమాలో డాన్స్ షేషావ్ షూడు- అది ఒక్కసారి షేయవే- వదిలేస్తా నిన్ను-"

మాకేం మాట్లాడాలో అర్థంకాలేదు-

"అయ్యో వీడి మొఖం మండిపోనూ- నన్ను సిల్కుస్మిత అంటాడేమిటి?" కోపంగా అంది పార్వతీదేవి.

"డాన్స్ షేష్తావా - లేదా- త్రీ' అనే లోపల షేయకపోతే లాకప్‌లో కెళ్ళిపోతావ్-"

"ఈమె షిల్కుష్మిత కాదుసార్-" అన్నాడు యాదగిరి. సర్కిల్‌కి కోపం ముంచుకొచ్చింది.

"వీడిని కూడా లోపలవేషేయండి-"

పోలీసులు యాదగిరిని కూడా వాన్‌లోకి తోసేశారు.

"ఏయ్ షిల్క్‌స్మితా- త్రీ అనే లోపల డాన్స్ షేష్తావా? షేష్తే- వదిలేష్తా! లేకపోతే జీప్‌లో వేషేష్తా!"

"నేను సిల్క్‌స్మితనా? నీ కళ్ళుపోయినయ్యా? మా కాలనీలో అందరూ నేను విజయ శాంతి లాగున్నానని అంటూంటే- నీకు సిల్క్ స్మితలా కనబడుతున్నానా!" మండిపడుతూ అంది పార్వతీదేవి.

"వన్-" అన్నాడు సర్కిల్.

మాకు భయం వేసింది– వాడు పార్వతీదేవినికూడా జీప్‌లో వేసుకెళ్ళిపోతాడేమోనని.

'టూ–" అన్నాడతను.

"చూడండీ! ఆడాళ్ళతో అలా ప్రవర్తించటం..." సర్దిచెప్పబోయాడు రంగారెడ్డి.

"త్రీ' గట్టిగా అరిచేశాడతను.

"పోనీ ఓసారి ఏదొక డాన్స్ చేసేస్తే పోతుందిగదా?" అన్నాడు రంగారెడ్డి నెమ్మదిగా పార్వతీదేవి చెవిలో. మా గొడవంతా విని ఆ చుట్టుప్రకల ఇళ్ళవాళ్ళందరూ నిద్రలేసి కిటికీల్లోనుంచి చూడటం ప్రారంభించారు.

"ఒరేయ్– దీన్ని జీప్‌లో వేషేయండి" అరచాడతను.

వాళ్ళు పార్వతీదేవి దగ్గరకొచ్చేసరికి ఆమె గట్టిగా కేకలు వేయటం ప్రారంభించింది. దాంతో నలుగురయిదుగురు స్టూడెంట్స్ పరుగుతో వచ్చారక్కడికి. స్టూడెంట్స్‌ని చూసి ధైర్యం తెచ్చుకొని మరికొంతమంది ఇళ్ళవాళ్ళు బయటికొచ్చారు.

పార్వతీదేవిని బలవంతంగా జీప్ ఎక్కించగానే, జీప్‌లు రెండూ వెళ్ళిపోయాయ్.

రంగారెడ్డి విషయమంతా చెప్పేసరికి అందరికీ పౌరుషం పొడుచుకొచ్చింది.

'ఇలా ఊరుకుంటే లాభంలేదు! ఇవాళ ఆమెను సిల్క్‌స్మిత అని డాన్స్ చేయమన్నాడు– రేపు మన ఆడాళ్ళను జయమాలిని డాన్స్ చేయమంటాడు– చేయకపోతే జీప్‌లో వేసుకుపోతాడు–" అన్నాడొకతను.

"ముందు మనమందరం డిప్యూటీ కలెక్టర్– గారింటికి వెళ్ళి రిపోర్టుచేద్దాం!" అన్నాడు స్టూడెంట్ లీడర్ రాజేశ్వర్రావ్. అరగంటసేపు నడిచాక అందరం డిప్యూటీ కలెక్టర్ గారింటికి చేరుకున్నాం. ఇల్లంతా లైట్లు వెలుగుతున్నాయ్ అప్పటికే.

మేము గేటు దగ్గర కెళ్ళేసరికే ఆయన భార్య ఆత్రుతగా బయటకు పరుగుతో వచ్చింది.

"ఏమయింది? ఆయనను వదిలేశారా?" అడిగిందామె.

మేము తెల్లబోయాం.

"ఎవరినండీ?"

"ఆయనే – డిప్యూటీ కలెక్టర్‌గారిని!"

మాకేమీ అర్థం కావటం లేదు ఆమె మాటలు.

"డిప్యూటీ కలెక్టర్ గారితో మాట్లాడ్డానికి వచ్చామండీ మేము–" అన్నాడు రంగారెడ్డి.

"అంటే ఆయనను వదిలేశారా?"

"వదిలేయట మేమిటండీ– మాకేమీ అర్థం కావటం లేదు!"

ఆమె చిరాకు పడింది.

"మీ రెవరసలు?"

"మేం హైదరాబాద్ నుంచి వచ్చామండీ! సిటీలోకి రాగానే మావాళ్ళను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి తీసుకుపోయారు. ఈ విషయం డిప్యూటీ కలెక్టర్‌గారికి రిపోర్ట్ చేద్దామని ఇక్కడి కొచ్చాం-"

ఆమె రెండు చేతులతో తల పట్టుకుంది.

"ఏడిచినట్లుంది! రాత్రి డిప్యూటీ కలెక్టర్‌గారే కాంప్‌నుంచి తిరగి వస్తూంటే ఆయనో రౌడీ లాగున్నాడని అనుమానించి జీప్ డ్రైవర్‌తో సహా అందరినీ అరెస్ట్ చేసి లాకప్‌లో పడేశారు. ఆయన డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఇంతమంది వెళ్ళి బ్రతిమాలినా ఆయనను వదలటం లేదు-"

మాకు మతిపోయింది.

"పోనీ కలెక్టర్ గారికి ఫోన్ చేయకపోయారా?" అన్నాన్నేను.

"ఆ పనెప్పుడో చేశాం, ఇంకెక్కడయినా తను జోక్యం కలుగజేసుకుంటారటగానీ విజయవాడ పోలీసులతో మాత్రం పేచీకి దిగటం తన ప్రిన్సిపుల్స్‌కి వ్యతిరేకమని అన్నారాయన"

"ఇలాక్కాదు- వెంటనే ముఖ్యమంత్రికి టెలిగ్రాం ఇద్దాం!" అన్నాడు రాజేశ్వర్రావ్.

అందరం టెలిగ్రాఫ్ ఆఫీస్‌కెళ్ళాం. అప్పటికే ఆ ఇద్దరు కానిస్టేబుల్స్ అక్కడ నిలబడి ఉన్నారు.

"మీ దగ్గర్నుంచీ టెలిగ్రాం తీసుకోం సార్-" అన్నాడు టెలిగ్రాఫ్ క్లర్క్.

"ఎందుకని?"

"ఇప్పుడే టెలిగ్రామ్స్ తీసుకోవటం స్టాప్ చేయమని పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆర్డర్స్ వచ్చాయ్-"

"అదేంటి? మిమ్మల్ని ఆజ్ఞాపించటానికి వాళ్ళెవరు?"

"పోలీస్ బిల్ ప్రకారం వాళ్ళకి మా డిపార్ట్‌మెంట్ మీద పూర్తి అధికారం ఉంది-"

"ఎవరయ్యా ఇలాంటి తెలివితక్కువ బిల్ తయారు చేసింది?" అరచాను నేను కోపంగా.

"మన ముఖ్యమంత్రీ, హోమ్‌మంత్రిగారూ కలసి చేసి పనండీ ఇది-"

"వాళ్ళెవరూ విజయవాడ వచ్చి ఏం జరుగుతుందో చూడరా."

"వాళ్ళది చాలా జాలిగుండె ఆండీ! ప్రజలిలా కష్టాలు పడుతూంటే చూడలేరు. అందుకే ఇక్కడికి రావటం మానేశారు..."

"ఓ పనిచేద్దాం!" అన్నాడు రాజేశ్వర్రావ్. "మా డాక్టరుగారింట్లో ఫోన్ ఉంది. అక్కడికెళ్ళి ఐజీపీకి ముఖ్యమంత్రిగారికీ, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకు ఫోన్ చేద్దాం!"

"అయితే ఆలస్యం ఎందుకు? త్వరగా పదండి?" అందరం డాక్టరు గారింటికి బయల్దేరాం! అప్పటికే తెల్లారిపోవటం మూలాన మా అందరినీ చూచి మరికొంతమంది జనం పోగయ్యారు. డాక్టర్‌గారు సంగతంతా విని మండిపడ్డాడు.

"వెంటనే ట్రంక్ కాల్ చేయండి! లైట్‌నింగ్ కాల్ చేయండి! డైరెక్ట్ డయిలింగ్ కొట్టండి?" అన్నాడు.

రంగారెడ్డి హడావుడిగా రింగ్ చేశాడు. 'హలో–'

"హలో హలో హలో–" అంది అవతలి గొంతు.

"ముఖ్యమంత్రిగారితో అర్జంటుగా మాట్లాడాలి–"

"ముఖ్యమంషిగార్తొ మాట్లాడాలా? మాష్లాడంషి–"

రంగారెడ్డి ఆశ్చర్యంగా ఫోన్ నాకిచ్చాడు "ఇట్లా మాట్లాడ్తున్నా రేమిటో చూడు–"

నేను ఫోన్ అందుకున్నాను.

"హలో ఎవరు హాట్లాడుతున్నారు?" అడిగాను నేను.

"ఎవరేమిట్రా? నేనే ముఖ్యమంష్రిని–"

"ముఖ్యమంత్రిగారా?"

"అవునని షెప్తూంటే షెవుడేరా.. రాష్కెల్!"

"మేం హైదరాబాద్ నుండి విజయవాడ పనిమీద వచ్చామండీ! ఇక్కడ ఓతాగుబోతు పోలీస్ అధికారి మమ్మల్ని అరెస్ట్ చేసి మా ఆడాళ్ళను ఎత్తుకుపోయాడు–"

"అవున్రా ఆడిష్టం! ఎత్తుకపోతా్రా! నివ్వెవర్రా అడగటానికి! నిన్ను కూడా లోపల వేషేస్తాం! నోర్మూసుకుని ఫోన్ పెట్టేయ్–

నాకు అర్థమయింది.

"అవతల ఉన్నది మనని ఎటాక్ చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టరే– మనం మాట్లాడుతోంది ముఖ్యమంత్రిగారితో కాదు–"

"అదేమిటి హైదరాబాద్‌కి ఫోన్ చేస్తే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎలా వచ్చాడు ఫోన్లోకి?"

అందరం ఆశ్చర్యపోయాం.

"మైగాడ్! మర్చిపోయాను! మన విజయవాడ ఫోన్‌లన్నీ ఫోలీస్ డిపార్ట్‌మెంట్ టాపింగ్ చేస్తోంది! ఎక్కడికి రింగ్ చేసినా ముందు పోలీస్ ఆఫీసుకే వెళ్తుంది–"

"అందుకు టెలిఫోన్? డిపార్ట్‌మెంట్ ఎలా వప్పుకుంది?"

"పోలీస్ బిల్ ప్రకారం పోలీసుల కధికారం ఉంది"

అందరం నిశ్శబ్దమయిపోయాం.

"ముందు పోలీస్ స్టేషన్ కెళ్దాం– పదండి– అవతల ఆ తాగుబోతు మన రాజేశ్వరి




వాళ్ళను ఏం చేస్తున్నాడోఏమో–" అంది సుభద్ర ఆదుర్దాగా.

"అవును– అక్కడికే వెళ్దాం పదండి–" అన్నాడు రాజేశ్వర్రావ్. అందరం నడిచే బయల్దేరాం, అప్పటికే తెల్లారిపోవటంతో రోడ్డుమీద జనం తిరగటం మొదలయింది.

పోలీస్ స్టేషన్ బయట ఒక వాన్, జీప్ ఆగి ఉన్నాయ్. వాటిని చూడగానే మా అందరికీ కోపం ముంచుకొచ్చింది.

"పోలీస్ దౌర్జన్యం నశించాలి! చెరపట్టిన స్త్రీలను వదిలేయాలి–" అంటూ అరవసాగాం.

ఈలోగా ఇద్దరు కానిస్టేబుల్స్ తుపాకులు తీసుకుని మా దగ్గర కొచ్చారు.

"ఇక్కడి నుంచి అందరూ త్వరగా వెళ్ళిపోండి రెండు నిమిషాల క్రితమే ఈ ఏరియా అంతా ఎమర్జెన్సీ ప్రకటించారు మా కమీషనర్‌గారు–" అన్నాడొకతను. మాకేమీ అర్థం కాలేదు–" ఎమర్జెన్సీ డిక్లేర్ చేయడమేంటి?"

"ఎమర్జెన్సీ అంటే తెలీదా? నీ యమ్మ– ఇలాంటోళ్ళు కూడా ఉన్నారన్నమాట దేశంలో! ఎమర్జెన్సీ అంటే మాకు ఎదురు తిరిగిన వారందరినీ జైల్లో వేసేయటం– ఇదివరకోసారి చేయలా?"

"అంటే. మేం ఇక్కడినుంచి వెళ్ళకపోతే మమ్మల్ని కూడా జైల్లో వేస్తారా?" అడిగాడు యాదగిరి.

"చావగొట్టి మరీ వేస్తాం– అయినా ఎందుకొచ్చిన గొడవ మీకిది? ఇంకా ఒకటి రెండు గంటలు ఓపిక పట్టండి! మా సర్కిల్‌కి 'నిషా' దిగిపోతుంది.

* * * * *